సాక్షి గుంటూరు

సోమవారం : 15 : జనవరి : 2024



వైభవంగా గోదా కల్యాణం

అమరావతి: అమరావతి పాండురంగస్వామి దేవాలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. దేవాలయంలో వేకువ జామున పంచామృత స్నపన జరిపారు.



శ్రీవారికి అలంకారం

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని రైల్వే స్టేషన్‌రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీవారికి వేంకటపాండురంగస్వామి అలంకారం చేసి పూజలు జరిపారు.



శ్రీగోదా రంగనాథుని కల్యాణం

గుంటూరు ఎడ్యుకేషన్ : సంగడిగుంటలో ఆదివారం శ్రీగోదాదేవి రంగనాథుని కల్యాణాన్ని వేద పండితులు తాతాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 50 మంది దంపతులు పాల్గొన్నారు.

ఊరంతా భోగిభాగ్యం

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహణ
- భోగి మంటలతో ప్రారంభించిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని
- ఉత్సాహంగా పాల్గొన్న నగరవాసులు
- ఆకట్టుకున్న గంగిరెద్దులు, డప్పు విన్యాసాలు, హరిదాసుల గానాలు
- వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు



హరిదాసు వేషధారణలో ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్



గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగి మంట వెలిగిస్తున్న మంత్రి విడదల రజిని, ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ కావటి, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం భోగి పండగను పురస్కరించుకుని ఉదయాన్నే మంటలు వేసి, సంబరాల్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు. సంబరాల సందర్భంగా స్టేడియంలో సందడి వాతావరణం నెలకొంది. భోగి మంటలు, రంగవల్లులు పండుగ వాతావరణాన్ని తలపించాయి. చెరుకు గడలతో అలంకరణ, అతిథులకు సన్నాయి మేళాలతో స్వాగతం, గంగిరెద్దులు, డప్పు కళాకారుల విన్యాసాలు పల్లె సంస్కృతిని ప్రతిబింబించాయి. కోడి పుంజుల ఆటలు, చిన్నారులకు భోగి పండ్లు పోయడం నగరవాసులకు సంస్కృతి, సంప్రదాయాల్ని జ్ఞప్తికి తెచ్చాయి.

సంబరాల నిర్వహణ అభినందనీయం

మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పండగల సందడి అంటే పల్లెటూర్లేనని..అటువంటి పల్లెటూరి పండగ వాతావరణాన్ని గుంటూరు నగరపాలక సంస్థ సంక్రాంతి సంబరాలతో నగరవాసుల ముందుకు తీసుకురావడం అభినందనీయమన్నారు. నేటి తరానికి నాటి సంస్కృతి, సంప్రదాయాల్ని తెలియజేసేలా సంబరాలు జరుగుతున్నాయని తెలిపారు. నగరవాసులు కుటుంబ సభ్యులతో సంబరాల్లో పాల్గొని సంతోషంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.



కోడి పందేలలో ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, మంత్రి విడదల రజిని

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి తెలుగువారికి అతి ప్రధానమైన పండగ అన్నారు. కుటుంబ సభ్యులు ఎక్కడున్నా సొంత గ్రామాలకు వచ్చి జరుపుకుంటారని తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గత ఏడాది కూడా సంక్రాంతి సంబరాల్ని అద్భుతంగా నిర్వహించారని గుర్తు చేశారు.
- ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతూ పంట చేతికి వచ్చిన సందర్భంగా ఆనందంగా జరుపుకొనే పండగ సంక్రాంతి అన్నారు. నగర ప్రజలు సంక్రాంతి సంబరాల్లో కుటుంబ సమేతంగా పాల్గొని ఆస్వాదించాలని కోరారు.
- ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో జరిగే పండుగ శోభను నగర పాలక సంస్థ గుంటూరు నగర ప్రజలకు చేరువ చేసిందని తెలిపారు.
- మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గత ఏడాది సంక్రాంతి సంబరాలను అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుకున్నామన్నారు. ఈ ఏడాది కూడా అన్ని వయస్సుల వారిని అలరించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. సంప్రదాయ క్రీడలు, కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రతి రోజూ పండుగ వాతావరణం ఉంటుందని తెలిపారు.
- పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ పండగలు ప్రజల్లో ఐక్యతా భావాన్ని, కుటుంబ విలువలను చాటి చెప్తాయని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అన్ని వర్గాల్ని అలరిస్తున్నాయని ప్రశంసించారు.
- తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ సంక్రాంతి ప్రపంచంలోని తెలుగు ప్రజలందరికీ ముఖ్యమైన పండగ అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంబరాల ద్వారా పండగ వాతావరణాన్ని ప్రజలు ఆస్వాదిస్తున్నారని తెలిపారు.
- సంబరాల్లో మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, ముస్తఫాలు పాటలకు నృత్యాలు చేస్తూ, హరిదాసు వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ మహ్మద్ రఫిక్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



భోగి పండ్లు పోస్తున్న మంత్రి విడదల రజిని, ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యేలు

విశ్వాసంతో విజయం



సమష్టి దివ్యపూజా బలిని సమర్పించేందుకు వెళుతున్న కార్డినల్ పూల ఆంథోని

ఉంగుటూరు: బ్రదర్ జోసఫ్ తంబి ప్రార్థన, విశ్వాసం ద్వారా క్రీస్తు రక్షణను ఈ లోకంలో ఫలింపజేశారని గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. మండలంలోని పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్ధంతి మహోత్సవాలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. ఉదయం 7గంటలకు గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య తంబి సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహించిన అనంతరం కళావేదికపై దివ్య పూజాబలిని సమర్పించారు. క్రీస్తులో విశ్వాసం ఉంచు వారంతా రక్షణ పొందుతారని బోధించారు. విశ్వసించిన వారు జ్ఞాన స్నానం పొంది పది ఆజ్ఞలను పాటిస్తూ ప్రార్థనతో జీవించాలని సూచించారు. కపూచియన్ ప్రొవెన్షియల్ ఫాదర్ మరియదాసు ప్రత్తిపాటి, పుణ్యక్షేత్ర రెక్టర్ పాలడుగు జోసఫ్, విచారణ ఫాదర్లు పూజానంతరం బిషప్‌ను ఘనంగా సత్కరించారు.

కిక్కిరిసిన క్షేత్రం..

ఉత్సవాల్లో రెండోరోజు ఆదివారం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యాత్రికులతో పుణ్యక్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. సాయంత్రం 5గంటలకు హైదరాబాద్ అగ్రపీఠాధిపతులు కార్డినల్ పూల అంథోని తంబి సమాధిని సందర్శించి కళావేదిక వద్ద సమష్టి దివ్యపూజా బలిని సమర్పించారు. జోసఫ్ తంబిని ఆదర్శంగా తీసుకుని క్రైస్తవ విశ్వాసాన్ని బలపరచుకోవాలని పిలుపునిచ్చారు. ఫాదర్ జాన్, మాథ్యూస్ ఆధ్వర్యంలో సెయింట్ ఫ్రాన్సిస్, బ్రిందిసి బ్రదర్లు పాటలను ఆలపించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫాదర్లు, కన్యా స్త్రీలు, విశ్వాసులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో భోగి వేడుకలు



అమరావతి: సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా ప్రసిద్ధ అమరేశ్వరాలయంలో ఆదివారం భోగి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ఈవో వేమూరి గోపీనాథ శర్మ ఆధ్వర్యంలో వేకువజామున భోగి మంటలు వేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయం వద్ద మహిళలు రంగురంగుల ముగ్గులు వేసి, పాటలు పాడుతూ కోలాటం ఆడారు. అనంతరం కొత్త కుండలో స్వామివారికి అభిముఖంగా క్షీరాన్నం వండి, నైవేద్యం అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ భోగి పండగ విశిష్టతను వివరించారు. ఈ పండగతో పాడిపంటలతో పాటు ఆధ్యాత్మిక సంప్రదాయాల్ని ప్రజలు ఆచరించడం కోసం సంక్రాంతి నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం పల్లకీలో అమరేశ్వరుడు, బాలచాముండేశ్వరీదేవి ఉత్సవమూర్తులకు మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సంక్రాంతి ఉత్సవాలలో తొలి రోజున స్వామిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయంలో సంక్రాంతి పండుగ మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

19న గుంటూరు నుంచి విజయవాడకు పాదయాత్ర



నెహ్రూనగర్: ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ (స్మృతి వనం) ఈనెల 19న జరగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం కోరారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే అత్యంత ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో 19న జరిగే ఈ బృహత్తర కార్యక్రమానికి లాడ్జి సెంటర్ నుంచి ఉదయం 6 గంటలకు పాదయాత్రగా వెళ్లనున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బహుజనులంతా హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మంచాల జోసెఫ్, సముద్రాల కోటేశ్వరరావు, రాంబాబు, గోపి, కొరివి రజిని, సుభాని పాల్గొన్నారు.

నేడు పోలీసు స్పందన రద్దు

నగరంపాలెం : మకర సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో జరగాల్సిన స్పందన కార్యక్రమం రద్దుచేసినట్లు కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

అంగరంగ వైభవంగా వేడుకలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



భోగి మంటలు వెలిగిస్తున్న చైర్మన్ రాంబాబు, ఈవో రామారావు, అధికారులు

ఇంద్రకీలాద్రిపై సంక్రాంతి కోలాహలం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సంక్రాంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటలను చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో కేఎస్ రామారావులతో పాటు అధికారులు, అర్చకులు, పాలక మండలి సభ్యులు వెలిగించారు. తొలుత భోగి మంట వద్ద చైర్మన్, ఈవోలు పూజలు నిర్వహించారు. అనంతరం రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన గంగిరెద్దులకు పూజలు చేసి, దాణా అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అమ్మవారి ఆలయంలో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. పల్లె వాతావరణాన్ని తలపించేలా పూరి పాకలు, గంగిరెద్దులు, హరిదాసులు, మట్టి పాత్రల తయారీ, పందెం కోళ్ల గూళ్లు, మేళతాళాలతో తెలుగు వారి సంప్రదాయం ఉట్టి పడింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పల్లె వాతావరణాన్ని చూసి ముగ్ధులయ్యారు. చిన్నారులు, పెద్దలు సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంతో పాటు చిన్న గాలిగోపురం, ప్రధాన ఆలయం ద్వారం వద్ద పూలతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణాన్ని అరటి చెట్లు, మామిడి తోరణాలతో అలంకరించారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

రాజగోపురం ఎదుట కళావేదిక వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. వివిధ దేవతా మూర్తుల విగ్రహాలు, కొండపల్లి బొమ్మలతో పాటు పల్లె వాతావరణాన్ని తలపించే బొమ్మలు ఆకట్టుకున్నాయి. బొమ్మల కొలువును చైర్మన్, ఈవోలు ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం బొమ్మల కొలువు వద్ద చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు.

సీఎం జగన్ స్ఫూర్తితో బజరంగ్ సేవా పరంపర



శిబిరానికి హాజరైన వారితో అంబటి మురళీకృష్ణ

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు (గుంటూరు): సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపర కొనసాగిస్తున్నట్లు వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జగన్నామ సంక్షేమ సంగమం పేరుతో బజరంగ్ నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగ దర్శిని వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నేటితో 85 సేవా కార్యక్రమాలను, వివిధ గ్రామాల్లో సంక్షేమ సంగమ శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. నేత్రజ్యోతి పేరుతో అంధత్వ సమస్య నివారణకు గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి, అవసరమైన వారికి ఏడు రోజుల్లో కళ్లజోళ్లు అందిస్తున్నామని వెల్లడించారు. మీ గుండె పదిలం పేరుతో విజయవాడ మెడ్ ఆసుపత్రి నుంచి నిపుణులైన వైద్య బృందాలను గ్రామాలకు రప్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోనే ప్రత్యేక వైద్య శిబిరం, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుండె సమస్య ఉన్న వారికి యాంజియోగ్రాం నిర్వహించి, సమస్య తీవ్రతను బట్టి స్టంట్లు, బైపాస్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగ దర్శిని ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిల్స్, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడ్‌లు అందజేసి వారి సౌకర్యవంతమైన జీవితానికి బజరంగ్ ఫౌండేషన్ చేయూతనిస్తోందని పేర్కొన్నారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు: హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ సమేతంగా భోగి పండుగను జరుపుకున్న ప్రజలు సంక్రాంతి, కనుమలను రెట్టించిన ఉత్సాహంతో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. పేద, బడుగు, బలహీనవర్గాల పెన్నిధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో తీసుకువచ్చిన గ్రామ స్వరాజ్యంతో పలెటూర్లు కళకళ లాడుతున్నాయని అన్నారు. సంక్షేమ పాలనలో రాష్ట్రం మరింత సుభిక్షంగా ఉండాలని పేర్కొన్నారు.

ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు



పట్నంబజారు: ప్రతి కుటుంబంలో సంక్రాంతి కాంతులు విరబూయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ కోరారు. సంక్రాంతి పురస్కరించుకుని జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించాలని కోరారు. ప్రతి ఇంట సంక్షేమ సంబరాలు వెల్లివిరియాలని, అభివృద్ధితో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో కంటైనర్ డ్రైవరు మృతి

మృతుడు ఉత్తరప్రదేశ్ వాసిగా గుర్తింపు



రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామ సమీపంలో అద్దంకి–నార్కెట్‌పల్లి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చెన్నై నుంచి హైదరాబాద్‌కు పాత ఇనుము లోడుతో వెళ్తున్న లారీ, హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళ్తున్న కంటైనరు అన్నవరప్పాడు సమీపంలోకి రాగానే ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ పునీత్ కుమార్(24) మృతి చెందాడు. ప్రమాదంలో రెండు వాహనాలు ఢీకొనడంతో కంటైనర్ డ్రైవర్ క్యాబిన్‌లోనే చిక్కుకొని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కేపీ.రవీంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతి చెందిన పునీత్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

బావిలో పడి ఆర్టీసీ మెకానిక్ మృతి

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెంది 18 రోజులు గడవకముందే కుమారుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందటంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అంబేడ్కర్ కాలనీకి చెందిన కంభంపాటి కోటేశ్వరరావు గత నెల 27వ తేదీన మార్కెట్ యార్డులో కూరగాయలు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా, కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో విషాదం అలుముకున్న ఇంటిలోనే మరో విషాదం చోటు చేసుకుంది. ఈయన పెద్ద కుమారుడైన కంభంపాటి వెంకటరావు (45) చిలకలూరిపేట ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పని చేస్తూ సోదరుడు రాంబాబుతో కలిసి గ్రామంలో కొంత పొలాన్ని సాగు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు ఇరువురూ వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో భోజనం తెచ్చేందుకు రాంబాబు ఇంటికి వెళ్లాడు. ఈ సమయంలో వెంకటరావు ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. భోజనం తీసుకుని పొలానికి వచ్చిన రాంబాబు తన సోదరుడి కోసం వెతకగా బావిలో శవమై కనిపించాడు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తుంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కారంచేడులో ప్రముఖుల సందడి

కారంచేడు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కారంచేడులో గ్రామానికి చెందిన సినీ, రాజకీయ ప్రముఖులు కుటుంబ సభ్యులతో సందడి చేశారు. శనివారం రాత్రికే గ్రామానికి చేరుకున్న సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు, లక్ష్మి, వెంకటేష్, నీరజ, హీరో రానా, మిహికా బజాజ్, సినీ హీరో అభిరామ్, భార్య ప్రత్యూష దంపతులు, సురేష్‌బాబు కుమార్తె మాళవిక, రామానాయుడు సతీమణి రాజేశ్వరి గ్రామంలోని ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆరాధ్యదైవం అయిన కట్టమల్లేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేశారు. మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుమారుడు, కోడలు, కుమార్తె, అల్లుడు, పిల్లలతో గ్రామంలో భోగి పండుగ నిర్వహించారు. సినీ హీరోలైన రానా, అభిరామ్‌లతో గ్రామస్తులు సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపించారు.

వాస్తవాలను ప్రతిబింబించేవే నాటికలు

కొనసాగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు



నాటిక పోటీలను ప్రారంభిస్తున్న తేళ్ల అరుణ, కందిమళ్ల జయమ్మ, ఇందిర, చంద్రకళ



రైతుభారతం నాటికలోని ఓ సన్నివేశం

యద్దనపూడి: సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపించేవే నాటికలని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. ఆదివారం మండలంలోని అనంతవరం గ్రామంలో నాలుగో రోజు ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ద్వితీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ, చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు మారెళ్ల ఇందిర, కథ, నవల రచయిత్రి చంద్రలత పాల్గొన్నారు. తేళ్ల అరుణ మాట్లాడుతూ సమాజంపై ప్రభావం చూపించటంలో నాటికల పాత్ర కీలకమన్నారు. భాష ఉన్నతికి చిరునామాగా, సామాజిక హితాన్ని కాంక్షిస్తూ ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని వాస్తవ పరిస్థితులను పంచే నాటికలకు పూర్వవైభవం రావాలని ఆకాంక్షించారు. నవలా రచయిత్రి చంద్రకళ మాట్లాడుతూ కళాపరిషత్‌లే కాక ప్రభుత్వాలు, ప్రైవేట్ టీవీ చానళ్లు, ఆధ్యాత్మిక సంస్థలు కూడా నాటికలకు ప్రోత్సాహం అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ భారతీయ సమాజాన్ని పట్టిపీడిస్తున్న వివక్షను నాటకం, నాటికలు ఎండగట్టాయని, సామాజిక వివక్షలకు వ్యతిరేకంగా నాటిక ప్రదర్శనలు ఓ ఉద్యమమే చేసిందన్నారు. అలాంటి కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, మద్దినేని జయరామకృష్ణ, గుదే తారక రామారావు, పోపూరి హనుమంతురావు, కొరిటాల వంశీకృష్ణ, శివసుబ్బారావు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన నాటికలు..

నాలుగో రోజు తొలినాటికగా న్యూస్టార్ మోడరన్ థియేటర్స్ ఆర్ట్స్ విజయవాడ వారి 'కపిరాజు', రసఝరి పొన్నూరు వారి 'కాపల', శ్రీకారం రోటరీ కళాపరిషత్ 'రైతు భారతం' నాటికలు దేనికదే తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. కళాకారుల ప్రదర్శనలతో వీక్షకులను రంజింపజేశారు.

సొసైటీ లంక భూముల హక్కుదారులకు పట్టాలు ఇవ్వాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య



మాట్లాడుతున్న కృష్ణయ్య

తాడేపల్లిరూరల్: ప్రాతూరు సొసైటీ లంక భూముల హక్కుదారులకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య కోరారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి దళితవాడలో హక్కుదారుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాతూరు సొసైటీ లంక భూములను హక్కుదారులైన దళితులు సాగు చేసుకునేందుకు వీలుగా లంక భూములను సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ కుంచనపల్లి, ప్రాతూరు గ్రామాల్లో లబ్ధిదారులైన కౌలు రైతులు ఒక్కో ఎకరం కౌలుకు తీసుకునేందుకు 60 వేల నుంచి లక్ష రూపాయల వరకు భూ యజమానులు తీసుకుంటున్నారని అన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న దళిత రైతులకు ప్రాతూరు సొసైటీ లంక భూములను సర్వే చేసి, లబ్ధిదారులైన దళితులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఎ.రామారావు, మహిళా సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కె.యశోద, ఎస్.శివపార్వతి, లంక భూముల రైతులు బి.పాల్, కె.మహేశ్వరరావు, జాన్, ఎస్.మత్తయ్య, ఎం. భాస్కరరావు, దేవకరుణ, పి.మరియమ్మ, ఎస్.మ్యాచ్‌పాల్ పాల్గొన్నారు.

మామిళ్లపల్లిలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలలో మొదటి స్థానం సాధించిన మహిళకు రూ.15 వేలు చెక్కు అందజేస్తున్న అంబటి మురళీకృష్ణ

విజేతలకు బహుమతులు అందించిన బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): బజరంగ్ 'జగన్నామ సంక్షేమ సంగమం'లో భాగంగా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పొన్నూరు మండలం, మామిళ్లపల్లి గ్రామంలో గ్రామీణ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామీణ మహిళల ప్రతిభను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో గ్రామంలో ఆదివారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో 127 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ చూపిన ముగ్గురు మహిళలకు మొదటి బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.7 వేలతో పాటు మరో ఐదు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గత ఏడాది పెద్దేటమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట జరిగిన వెంటనే సంక్రాంతి సంబరాలలో భాగంగా చిన్న పిల్లలకు పెద్దేటమ్మ తల్లి ఆశీస్సులతో భోగిపళ్లతో దీవించిన విధంగానే, ఈ సంవత్సరం కూడా గ్రామంలోని చిన్నారులకు వంద సంవత్సరాలు వర్ధిల్లాలని భోగి పళ్లపోయడం జరిగిందన్నారు. గ్రామస్తులు ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శించి విజయవంతం చేశారని పేర్కొన్నారు. తమ స్వగ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు.

తుదిదశకు జాతీయస్థాయి టీ-20 పోటీలు

సెమీస్‌కు చేరిన శ్రీకాకుళం, కామారెడ్డి జట్లు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న జీవనందన్



చెన్నై, కామారెడ్డి జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

జే.పంగులూరు: సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామంలో పానెం హనిమరెడ్డిస్ జాతీయ స్థాయి టీ–20 క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈపోటీలు చివరి దశకు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లను చూసేందుకు క్రీడాభిమానులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు.

మ్యాచ్‌ల వివరాలు..

ఉదయం చిక్కోలు చీతాస్ (శ్రీకాకుళం), కేరళ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట టాస్ గెలిచిన శ్రీకాకుళం నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కేరళ 17.1 ఓవర్లలో 146 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో శ్రీకాకుళం 75 పరుగుల తేడాతో విజయ సాధించి సెమీస్‌లోకి దూసుకెళ్లింది. శ్రీకాకుళం క్రీడాకారుడు బీఎస్ వినయకుమార్ 30 పరుగులు చేసి, బౌలింగ్‌లో 3 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు.

– మధ్యాహ్నం ఎంఆర్‌సీసీ (చెన్నై), లెవన్ బ్రదర్స్ (కామారెడ్డి) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మ్యాచ్‌లో మొదట టాస్ గెలిచిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 16.3 ఓవర్లు ఆడి 89 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కామారెడ్డి 10 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. దీంతో కామారెడ్డి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో 3 వికెట్లు తీసిన కామారెడ్డి బౌలర్ జీవనందన్ మాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించాడు..

నేడు సెమీఫైనల్ మ్యాచ్‌లు..

సోమవారం ఉదయం మెదటి సెమీస్ మ్యాచ్‌లో బళ్లారి, లెవన్ బ్రదర్స్ (కామారెడ్డి) జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. రెండో సెమీస్ మధ్యాహ్నం జార్ఖండ్, శ్రీకాకుళం జట్ల మధ్య జరుగుతుందని క్లబ్ చైర్మన్ కరణం స్వామి తెలిపారు.

సెమీస్‌కు చేరిన చెన్నై జట్లు

హోరాహోరీగా జాతీయస్థాయి క్రికెట్ పోటీలు



థండర్‌బోల్ట్స్ తిరుపతి- చెన్నై మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్‌ను రన్ అవుట్ చేస్తున్న కీపర్



4 వికెట్లు తీసిన బౌలర్ తరుణ్

మేదరమెట్ల: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావినూతల క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న భ్రమర సంక్రాంతి కప్–2024 పోటీల్లో భాగంగా ఆదివారం జరిగిన రెండు మ్యాచ్‌లలో చెన్నై జట్లు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరాయి. ఉదయం శ్రీసీసీ (చెన్నై) –థండర్‌బోల్ట్(తిరుపతి) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన తిరుపతి జట్టు ప్రత్యర్థి జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్యాటింగ్ ఆరంభించిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జట్టులో మురుగేష్ 34 నాటౌట్, వసీం 25 పరుగులు చేశారు. తిరుపతి బౌలర్లలో ప్రకాష్, నవీద్ చెరీ రెండు వికెట్లు తీశారు. అనంతరం 124 పరుగులు విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన తిరుపతి జట్టు పేలవ ఆట తీరుతో 11.3 ఓవర్లలో 44 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. చెన్నై బౌలర్లలో టి.తరుణ్ 2.3 ఓవర్లలో 7 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీసి తిరుపతి జట్టు వెన్నువిరిచాడు. దీంతో 79 పరుగుల భారీ తేడాతో శ్రీ సీసీ చెన్నై జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది.

– మధ్యాహ్నం ప్రసాద్ జీ స్పోర్ట్స్ లెవెన్ (హైదరాబాద్)– జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన హైదరాబాద్ బ్యాటింగ్ ఎంచుకొని 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. జట్టులో అభి 56 పరుగులు చేశాడు. చెన్నై జట్టు బౌలర్ చంద్రశేఖర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం 142 పరుగుల విజయం లక్ష్యం కోసం బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 16.2 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా విజయం సాధించింది. దీంతో జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) జట్టు ఆరు వికెట్ల తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుంది. జట్టులో కవిన్ 44 పరుగులు, సుధాన్ 32 పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డారు.

నేడు సెమీ ఫైనల్స్‌లో తలపడే జట్లు..

ఉదయం మొదటి సెమీఫైనల్ చిక్కోల్ చీతాస్ (శ్రీకాకుళం)–శ్రీసీసీ (చెన్నై) జట్ల మధ్య జరుగుతుంది. మధ్యాహ్నం రెండో సెమీఫైనల్ జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై)–సౌత్ సెంట్రల్ సీసీ (చెన్నై) జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నట్లు అధ్యక్ష్యుడు కారుసాల నాగేశ్వరరావు తెలిపారు.

గుర్తుకొస్తున్నాయి..!

35 సంవత్సరాల తర్వాత కలుసుకున్న మిత్రులు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 1989 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 35 సంవత్సరాల తరువాత మళ్లీ కలుసుకున్నారు. ఆదివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగింది. దేశ, విదేశాల్లో స్థిరపడి ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వీరందరినీ ఒక తాటిమీదకు తీసుకురావడానికి కొంత మంది విద్యార్థులు నడుం బిగించారు. పాఠశాల ఆవరణలో కుటుంబ సభ్యులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు.

చిన్ననాటి ఊసులు నెమరవేసుకున్నారు. ఆడిన ఆటలు, పాడిన పాటలు, కోతి చేష్టలను నెమరవేసుకొని నవ్వుకున్నారు. కుటుంబ సభ్యులు, పిల్లలను పరిచయం చేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించుకున్నారు. ఆతీ్మయ విందు ఏర్పాటు చేసుకొని అనుభూతులను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో పాదిలి శ్రీనివాసరావు, రాయిని శ్రీను, దిరిసాల నాగశ్రీను, జానీసైదా, నాగమణి, ప్రవీణ్, పద్మజ, వెంగమాంబ, వెంకటరమణ మిత్ర బృందం పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లా స్థాయి రెజ్లింగ్ జట్లు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఆదివారం పల్నాడు జిల్లా మహిళా, పురుషుల రెజ్లింగ్(కుస్తీ) జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా పురుషుల జట్టుకు ఎస్.దయాకర్, పి.నాగరాజు, సీహెచ్.అబ్రహాం, కె.లాలూనాయక్, జి.వాసు, పి.చలపతి, కె.రామకృష్ణ, ఎస్.ప్రసాదరావు, ఎస్.బాబు, ఎస్.బాలకోటేశ్వరరావు, ఎం.పెదరాయుడు, ఏ.విజయకుమార్, మహిళా జట్టుకు ఎస్.విజయకుమారి, ఆర్.దేవమణి, జి.నిటీషా ఎంపికైనట్లు అసోసియేషన్ కార్యదర్శి జి.భూషణం తెలిపారు. ఎంపిక పోటీలను డీఎస్ఏ కోచ్ కె.మనోహర్, అసోసియేషన్ సభ్యులు ఆర్.జేమ్స్, పి.మహేష్ పర్యవేక్షించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20, 21తేదీలలో కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని భూషణం తెలిపారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియా రెజ్లింగ్ పోటీలలో 87 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిన పి.నాగరాజును అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

నకరికల్లు: వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో హోంగార్డు మృతి చెందాడు. ఈ ఘటన స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన షేక్. సాయిబాబా (45) నరసరావుపేటలో ట్రాఫిక్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం విధులకు హాజరయ్యేందుకు తన ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు బయలుదేరాడు. మార్గ మధ్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ క్రమంలో వెనుకనుంచి వస్తున్న లారీ సాయిబాబాను ఢీకొట్టింది. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వల్లెపు కోటేశ్వరరావు తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్వారీ నీటిగుంటలో పడి గొర్రెల కాపరి మృతి

అమరావతి: టీడీపీ పాలనలో డ్రెడ్జర్లతో ఇసుక తీయటం కారణంగా ఏర్పడిన గుంటలలో పడి ఇప్పటి వరకు సుమారు 23 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా తాడి ఎత్తు కుంటల కారణంగా శనివారం గొర్రెలు కాచుకునే ఓ యువకుడు బలయ్యాడు. మాచర్ల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి జానపాటి వీరాంజనేయులు(35) తన గొర్రెల మందతో గొర్రెలు మేపటానికి కొండ ప్రాంతానికి చేరుకున్నాడు. రోజు లాగానే శనివారం గొర్రెలు మేపుకుంటూ కుంటలో గొర్రెలకు నీరు తాగిద్దామనే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కాలుజారి కుంటనీటిలో పడి మునిగి చనిపోయాడు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ బ్రహ్మం తెలిపారు. ఆదివారం కుంటలో పడి మృతి చెందిన వీరాంజనేయులు మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
847	247
72,568	21,895

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,973	▲	3
డోజోన్స్	37,593	▼	118
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,625	▲	48
డాక్స్	16,705	▲	158
షాంఘై	2,882	▼	5
నికాయ్	35,557	▲	525

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.68	83.70
£	బ్రిటన్ పౌండ్	[illegible]	105.01	107.59
€	యూరో	[illegible]	92.38	92.56
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	56.74	58.04
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	56.69	56.81
S$	సింగపూర్ డాలర్	[illegible]	61.69	63.49
SAR	సౌదీ రియాల్	[illegible]	21.21	22.64
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.59	23.22
¥	చైనా యువాన్	[illegible]	10.41	23.36



రుణ పడొద్దు!

సొంత కారు, అందమైన భవంతి, ఇంట్లో అన్ని రకాల సాధనాలు (మెషీన్లు).. ఎందులోనూ రాజీపడేది లేదన్నట్టుగా ఉంది నేటి యువతరం ధోరణి. ముందు పొదుపు, తర్వాతే ఖర్చు.. గతంలో మన పెద్దలు అనుసరించిన ధోరణి. ముందు ఖర్చు.. మిగిలితేనే పొదుపు అన్నట్టుగా ఉంది నేటి తీరు. ఏ అవసరం వచ్చినా 'తగ్గేదే లే' అన్న ధోరణి కనిపిస్తోంది. కొనుగోళ్ల నుంచి వైద్య చికిత్సల వరకు అన్నింటికీ రుణబాట పడుతున్నారు. తీర్చే సామర్థ్యం ఉంటేనే రుణం తీసుకోవాలి. ప్రాధాన్యత లేని వాటికి సైతం రుణాలను ఆశ్రయిస్తే తీర్చే విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. కారణం ఏదైనా సకాలంలో రుణం వాయిదా చెల్లించలేకపోతే, ఎదుర్కోవాల్సిన పరిణామాలు చాలానే ఉంటాయి. చివరికి ఉద్యోగ అన్వేషణకు సైతం దూరం కావాల్సి రావచ్చు.

బకాయిలు సకాలంలో చెల్లించాలి


- లేదంటే క్రెడిట్ స్కోర్‌కు విఘాతం
- క్రెడిట్ రిపోర్ట్‌లో మచ్చ
- చట్టపరమైన చర్యలను ఎదుర్కొనే పరిస్థితి
- అనవసర చార్జీల భారం
- బ్యాంకుతో సంప్రదింపుల ద్వారా పరిష్కారం
- రుణంపై స్వల్పకాలం పాటు మారటోరియం
- గడువు పెంపుతో తగ్గే ఈఎంఐ

గతంలో బ్యాంకుల రుణ వృద్ధిలో కార్పొరేట్ రుణాలదే పైచేయిగా ఉండేది. మొదటిసారి 2020 (కరోనా విపత్తు కాలంలో) నవంబర్‌లో బ్యాంకుల రుణాల్లో కార్పొరేట్‌లను కాదని రిటైల్ రుణాలు ముందుకు వచ్చేశాయి. అప్పటి నుంచి 2023 నవంబర్ 17 నాటికి చూస్తే రిటైల్ రుణాలు 79 శాతం పెరగ్గా.. కార్పొరేట్ రుణాల్లో వృద్ధి 28 శాతానికి పరిమితమైంది. 2023లో రెండో త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లోనూ రిటైల్ రుణాల్లో వృద్ధి 15 శాతంగా నమోదైంది. రిటైల్ రుణాల్లో కన్స్యూమర్ ఉత్పత్తుల కొనుగోళ్ల కోసం తీసుకునేవి (విలువ పరంగా) 20 శాతం పెరిగాయి. ద్విచక్ర వాహన రుణాలు 18 శాతం వృద్ధి చెందాయి. వ్యక్తిగత అవసరాల కోసం తీసుకునే రుణాలు 12 శాతం పెరిగాయి. ఆటో రుణాలు 13 శాతం పెరిగితే, ఇంటి రుణాలు విలువ పరంగా మైనస్ 6 శాతంగా ఉన్నాయి. వినియోగ రుణాలు ఎక్కువగా ఉంటున్నట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కానీ, అదే సమయంలో రుణ ఎగవేతల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ రుణాల్లో ఒత్తిడి ఎక్కువగా ఉంది. 2023 జూలై నాటికి క్రెడిట్ కార్డ్ రుణాలు రూ.2.13 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏడాది క్రితం కంటే 31 శాతం పెరిగాయి. రిటైల్ రుణాలన్నీ కూడా అన్‌సెక్యూర్డ్. రుణ గ్రహీత చేతులు ఎత్తేస్తే అది బ్యాంకింగ్ వ్యవస్థపై భారాన్ని మోపుతుంది. అందుకే రిజర్వ్ బ్యాంక్ వ్యక్తిగత, అన్ సెక్యూర్డ్, క్రెడిట్ కార్డ్ రుణాలకు రిస్క్ వెయిటేజీ పెంచుతూ, వీటికి బ్యాంకులు మరిన్ని నిధులను పక్కన పెట్టేలా గత నవంబర్‌లో ఆదేశాలు తీసుకొచ్చింది.



క్రెడిట్ స్కోర్‌కు విఘాతం

తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించలేకపోయినా, రుణాన్ని ఎగవేసినా అది క్రెడిట్ స్కోర్‌ను గణనీయంగా తగ్గించేస్తుంది. కరోనా అనంతరం రిటైల్ రుణాలు తీసుకోవడం గణనీయంగా పెరిగిపోగా, అదే సమయంలో అంతకుముందు తీసుకున్న రుణాలకు సంబంధించి ఎగవేతలు కూడా పెద్ద మొత్తంలోనే నమోదయ్యాయి. దీంతో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు పెద్ద మొత్తాల్లో కేటాయింపులు చేయాల్సి వచ్చింది. ఈ పరిణామాలతో చాలా మంది రుణ గ్రహీతల క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడింది.



నేడు ప్రతి రుణానికి సంబంధించి చెల్లింపుల చరిత్రతో క్రెడిట్ బ్యూరోలు రికార్డులను నిర్వహిస్తున్నాయి. రుణం సకాలంలో చెల్లించకపోయినా, ఎగ్గొట్టినా, సెటిల్‌మెంట్ చేసుకున్నా, రుణం కావాలంటూ విచారణలు చేసినా, అవన్నీ సంబంధిత వ్యక్తి పేరిట రికార్డుగా నమోదవుతాయి. వీటి ఆధారంగానే క్రెడిట్ బ్యూరోలు స్కోర్‌ను కేటాయిస్తుంటాయి. 750, అంతకుమించి క్రెడిట్ స్కోర్ ఉంటే అది మెరుగైనది. రుణం సులభంగా వస్తుంది. మెరుగైన రేటుకు వస్తుంది. 750కంటే తక్కువ ఉంటే రుణం పొందడం కష్టమవుతుంది. ఒకవేళ రుణం లభించినా, అది అధిక వడ్డీ రేటుపై తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకని ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ వాయిదాలను సకాలంలో చెల్లించాలి. నేడు దాదాపు అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు క్రెడిట్ స్కోర్ ఆధారంగానే అన్‌సెక్యూర్డ్ రుణాలు మంజూరు చేస్తున్నాయి.

తదుపరి పరిణామాలు..

బకాయి చెల్లించాలంటూ రుణగ్రహీతను రుణం ఇచ్చిన సంస్థలు కోరతాయి. గడువు తీరిన 30 రోజులకూ చెల్లింపులు చేయకపోతే అప్పుడు ఆయా రుణగ్రహీతల సమాచారాన్ని క్రెడిట్ బ్యూరోలకు పంపిస్తుంటాయి. 30–60 రోజుల పాటు చెల్లింపులు చేయకపోతే అది క్రెడిట్ స్కోరును దెబ్బతీస్తుంది. ఇక రుణ వాయిదా 60 రోజులు దాటినా చెల్లించలేని వారి క్రెడిట్ స్కోర్ మరింత తగ్గిపోతుంది. తక్కువ క్రెడిట్ స్కోర్ వల్ల భవిష్యత్తులో రుణానికి ద్వారాలు మూసుకుపోతాయి. అత్యవసరంలో రుణం కావాల్సి వస్తే నిరాకరణ ఎదురుకావచ్చు. డిజిటల్‌గా రుణాలు ఇచ్చే సంస్థలు కనీసం ఒక్క రోజు ఆలస్యం చేసినా,ఎగవేతదారుల జాబితాలో చేరాల్సి వస్తోంది. 650–750 మధ్య స్కోర్ ఉన్న వారికి గృహ రుణం కావాలంటే, మెరుగైన స్కోర్ ఉన్న వారితో పోలిస్తే 2 శాతం అధిక రేటు చెల్లించాల్సి వస్తుంది. రూ.50 లక్షల రుణం 20 ఏళ్ల కాలవ్యవధికి కావాలంటే, తక్కువ స్కోర్ కారణంగా వడ్డీ రూపంలో అదనంగా రూ.12 లక్షల వరకు భారాన్ని మోయాల్సి రావచ్చు. సెక్యూర్డ్, అన్‌సెక్యూర్డ్ రుణాల మధ్య ఈ రేటు వ్యత్యాసం మారుతుంది.

రుణం ఎగ్గొట్టడం సివిల్ నేరం కిందకు వస్తుంది. రుణ గ్రహీత ఇచ్చిన చెక్కుల ద్వారా వసూలు చేసుకునే చర్యలను ఆర్థిక సంస్థలు ప్రారంభిస్తాయి. గడువు ముగిసిన 90 రోజుల్లోపు కూడా రుణ గ్రహీత చెల్లించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నోటీసు వస్తుంది. 180 రోజులు (ఆరు నెలలు) ముగిసినా ఎలాంటి ఫలితం లేకపోతే అప్పుడు నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్, 1881లోని సెక్షన్ 138 కింద రుణం ఇచ్చిన సంస్థ కేసు దాఖలు చేస్తుంది. చెల్లించే సామర్థ్యం ఉన్నా, చెల్లించకపోతే ఉద్దేశపూర్వక ఎగవేతదారు అనే ముద్ర పడుతుంది. సరైన కారణంతో రుణం చెల్లించలేని పరిస్థితుల్లో ఉంటే అప్పుడు రుణం ఇచ్చిన సంస్థతో చర్చలు నిర్వహించి పరిష్కారానికి, పరస్పర అంగీకారానికి రావచ్చు.

హోమ్‌లోన్ లేదా ప్రాపర్టీ లోన్ లేదా బంగారంపై రుణం వంటి సెక్యూర్డ్ రుణాల్లో రుణ గ్రహీత చెల్లింపుల్లో చేతులు ఎత్తేస్తే.. తనఖాగా ఉంచిన ఆస్తులను బ్యాంకులు వేలం వేస్తుంటాయి. అలాగే, ఆటోమొబైల్ రుణాల్లోనూ వాహనాన్ని జప్తు చేసి, చెల్లింపులకు తగినంత వ్యవధి ఇస్తాయి. అప్పటికీ చెల్లించకపోతే వాహనాన్ని వేలం వేసి రుణంలో సర్దుబాటు చేసుకుంటాయి.

బ్యాంక్ జాబ్ కష్టమే!

బలహీన క్రెడిట్ స్కోర్ ఉందంటూ ఉద్యోగ దరఖాస్తు తిరస్కరించే అధికారం బ్యాంకుల బోర్డులకు ఉంటుంది. బ్యాంక్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి కనీసం 650 క్రెడిట్ స్కోర్ ఉండాలన్న నిబంధనను ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) విధించింది. బాధ్యతాయుత ఆర్థిక నడవడిక ఉండాలన్నది దీని వెనుక ఉద్దేశం. ఎంతో విలువైన లావాదేవీల వ్యవహారాల బాధ్యతలను బ్యాంకుల ఉద్యోగులు చూస్తుంటారు. అందుకే ఈ నిబంధన ప్రవేశపెట్టారు. అందుకే బ్యాంకు ఉద్యోగాలకు ప్రయత్నించే వారు మెరుగైన స్కోర్ కోసం ముందు నుంచే తగిన జాగ్రత్త చర్యలను పాటించడం మంచిది. కొన్ని బహుళజాతి సంస్థలు కూడా ఉద్యోగం కోరుతున్న వారి క్రెడిట్ స్కోర్‌ను పరిశీలిస్తుంటాయి. 2022 మార్చిలో ఎస్‌బీఐ ప్రొబేషనరీ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ కోసం జారీ చేసిన ప్రకటనలో.. బ్యాంక్‌లు/ఎన్‌బీఎఫ్‌సీల నుంచి తీసుకున్న ఏ రుణం చెల్లింపుల్లో అయినా విఫలం అయినట్టయితే, క్రెడిట్ కార్డ్ బకాయిలు సకాలంలో చెల్లింపులు చేయకపోతే అటువంటి వారు నియామకానికి అర్హులు కాదని స్పష్టంగా పేర్కొంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సరీ్వసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్‌ఎస్‌ఐ) రంగంలో ఉద్యోగార్థుల క్రెడిట్ రిపోర్ట్‌లను పరిశీలించడం సర్వసాధారణమని.. దీనివల్ల ఆర్థికంగా ఎంత బాధ్యతాయుతంగా ఉంటారనేది తెలుస్తుందని డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ ఫైబ్ హెచ్‌ఆర్ హెడ్ మోనికా మిశ్రా తెలిపారు. ఇది సంస్థలో మోసాలు, చోరీల అవకాశాలను తెలియజేస్తుందన్నారు. ఆర్థిక అంశాల నిర్వహణలో బాధ్యతారహితంగా ఉండే వ్యక్తి, కంపెనీ ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు సరైన వ్యక్తి కాదని మిశ్రా వివరించారు.




రుణం కోసం రుణం...

తీసుకున్న రుణాన్ని చెల్లించలేని పరిస్థితుల్లో మరో రుణం తీసుకుని చెల్లించే ఆలోచనలు సరికాదు. ముందు తీసుకున్న రుణంపై అధిక వడ్డీ రేటు ఉండి, చాలా తక్కువ రేటుకే మరో సంస్థ రుణం ఇవ్వడానికి ముందుకు వస్తే అప్పుడు ఆలోచించొచ్చు. తక్కువ రేటుపై రుణం తీసుకుని అధిక రేటుతో కూడిన రుణాన్ని తీర్చివేయవచ్చు. వ్యక్తిగత రుణాలపై 14–15 శాతం మేర వడ్డీ రేటు ఉంటే, మెరుగైన క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి 12 శాతానికే లభిస్తుంది. అలాంటప్పుడు పరిశీలించొచ్చు. అంతేకానీ, చెల్లింపుల సమస్య నుంచి బయటపడేందుకు మరో రుణాన్ని ఆశ్రయిస్తే సమస్యను పెంచుకున్నట్టు అవుతుంది. అలాగే, క్రెడిట్ కార్డ్‌పై 3–4 రూపాయల వడ్డీ పడుతుంది. వ్యక్తిగత రుణాన్ని తీసుకుని క్రెడిట్ కార్డ్ రుణాన్ని తీర్చివేయవచ్చు.



రుణ గ్రహీత ముందున్న మార్గం

రుణం తీసుకుని, చెల్లింపులు సకాలంలో చేయకపోయినా.. రుణం ఇచ్చిన సంస్థలు గౌరవప్రదంగా, పారదర్శకంగానే వ్యవహరించాలి కానీ, వేధించడం, బెదిరించడం చేయకూడదని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్‌శెట్టి తెలిపారు. రుణం 90 రోజులకు మించి చెల్లింపులు లేకపోతే, అప్పటికీ చెల్లించేందుకు 60 రోజుల నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. సెక్యూర్డ్ రుణం చెల్లించనప్పుడు, తనఖాలో ఉంచిన ఆస్తులు లేదా వాహనాలను విక్రయించగా, వచ్చే మొత్తం నుంచి రుణం మినహాయించుకుని మిగిలినది తిరిగి రుణ గ్రహీతకు ఇచ్చేయాల్సి ఉంటుంది. రుణం చెల్లించలేనప్పుడు మారటోరియం లేదా వన్‌టైమ్ పరిష్కారం కోసం డిమాండ్ చేయవచ్చు. రుణం చెల్లించలేకపోవడం వెనుక సహేతుక కారణాలు ఉంటే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ సంస్థను సంప్రదించాలి. చెల్లించడానికి మరింత సమయం ఇవ్వాలని కోరొచ్చు. మీరు చెప్పిన కారణాల్లో వాస్తవికత ఉందని బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీ భావిస్తే రుణ చెల్లింపులపై స్వల్పకాలం పాటు మారటోరియం (విరామం) కల్పిస్తాయి. లేదంటే రుణ కాల వ్యవధిని పెంచి, ఈఎంఐ మొత్తాన్ని తగ్గిస్తాయి.



ఏ రుణంలో ప్రతికూలతలు ఎలా..?

క్రెడిట్ కార్డు రుణం



క్రెడిట్ కార్డ్ బిల్లు మొత్తం చెల్లించలేని సందర్భాల్లో, మినిమం డ్యూ (బిల్లులో నిర్దేశిత శాతం) చెల్లించినా సరిపోతుంది. ఈ మినిమం డ్యూని కూడా చెల్లించనట్టయితే ఆరు నెలలు వేచి చూసిన తర్వాత డిఫాల్ట్‌గా ఖరారు చేస్తారు. డిపాజిట్‌ను సెక్యూరిటీగా ఉంచి క్రెడిట్ కార్డు తీసుకుంటే, బకాయి పడిన సందర్భంలో డిపాజిట్‌ను రద్దు చేసి రుణం కింద సర్దుబాటు చేసుకుంటారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా పొందిన క్రెడిట్‌కార్డు అయితే, బకాయి వసూలు బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగిస్తాయి క్రెడిట్ కార్డు కంపెనీలు. రుణ గ్రహీత నుంచి రుణాన్ని రప్పించే ప్రయత్నాలను ఏజెన్సీలు చేస్తాయి. అప్పటికీ ఫలితం లేకపోతే కోర్టులో కేసు దాఖలవుతుంది. బ్యాంక్‌లు, క్రెడిట్ కార్డ్ కంపెనీలు బ్లాక్ లిస్ట్‌ను నిర్వహిస్తుంటాయి. చెల్లింపులు చేయని వారిని బ్లాక్ లిస్ట్‌లో చేరుస్తాయి.

విద్యా రుణం



విద్యా రుణం ఈఎంఐ చెల్లింపులు సాధారణంగా కోర్సు ముగిసి, ఉద్యోగంలో చేరిన నాటి నుంచి మొదలవుతాయి. కానీ, కొన్ని కారణాల వల్ల కోర్స్‌లో సకాలంలో ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగం రాదు. కోర్సు పూర్తి చేసినా కానీ వెంటనే అందరికీ ఉపాధి లభిస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. లేదంటే ఉద్యోగం వచ్చినప్పటికీ, అది కోల్పోయి ఖాళీగా ఉండాల్సి వచ్చిన సందర్భాల్లో రుణ ఈఎంఐ చెల్లించలేకపోతే, తదుపరి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వెంటనే ఉద్యోగం లభించకపోయినా, వచ్చిన ఉద్యోగం కోల్పోయినా బ్యాంకులను సంప్రదించి, పూర్తి వివరాలు తెలియజేయాలి. మరింత గడువు కోరాలి. లేదంటే బ్యాంక్‌లు నిర్దేశిత కాలం పాటు వేచి చూసి మిగిలిన రుణాల మాదిరే నోటీసు జారీ ద్వారా తదుపరి చర్యలు ప్రారంభిస్తాయి. విద్యా రుణానికి సంబంధించి డిఫాల్టర్‌గా మారితే భవిష్యత్‌లో ఎన్నో రుణాలకు అవరోధంగా మారొచ్చు. రూ.4–10 లక్షల వరకు విద్యా రుణాలకు బ్యాంక్‌లు ఎలాంటి సెక్యూరిటీని కోరవు. అంతకుమించితే మరో వ్యక్తిని గ్యారంటర్‌గా, లేదా ప్రాపర్టీని తనఖాగా ఉంచాలని కోరతాయి. సకాలంలో చెల్లించలేకపోతే గ్యారంటర్ క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది.

వినియోగ రుణం



కన్స్యూమర్ ఉత్పత్తుల కోసం తీసుకునే రుణాలు, వాహన రుణాలు అయినా గడువులోపు చెల్లించకపోతే ఒకటి రెండుసార్లు నోటీసును జారీ చేస్తాయి. 30 రోజుల్లోగా చెల్లించకపోతే అప్పుడు ముందుగా సమర్పించిన చెక్కులను నగదుగా మార్చుకునే చర్యలు మొదలు పెడతాయి. చెక్కులు బౌన్స్ అయితే కోర్టులో కేసు దాఖలు చేస్తాయి. వాహనం లేదా ఉత్పత్తిని స్వాధీనం చేసుకుంటాయి. వడ్డీసహా రుణ మొత్తాన్ని చెల్లించి సమస్య నుంచి బయటపడవచ్చు.

వ్యక్తిగత రుణం



వ్యక్తిగత రుణం వాయిదా గడువు ముగిసిన 30 రోజుల వరకు చెల్లించకపోతే డిఫాల్ట్‌గా పరిణిస్తాయి. ఇదే విషయాన్ని క్రెడిట్ బ్యూరోలకు తెలియజేస్తాయి. ఇలా వరుసగా మూడు వాయిదాల్లో విఫలమైతే అప్పుడు రుణంపై అదనపు వడ్డీ రేటును (పీనల్ ఇంటరెస్ట్) వడ్డిస్తాయి. 30 నుంచి 60 రోజుల్లోపు రుణ వాయిదాను వడ్డీ, అన్ని చార్జీలతో చెల్లిస్తే క్రెడిట్ స్కోర్‌పై స్వల్ప ప్రభావమే పడుతుంది. 90 రోజులకు కూడా చెల్లించకపోతే క్రెడిట్ స్కోర్‌పై ఎక్కువ ప్రభావం పడుతుంది. 180 రోజుల తర్వాత కూడా చెల్లింపులు రాకపోతే అప్పుడు రుణ గ్రహీతపై కేసులు దాఖలవుతాయి.

గృహ రుణం



ఇంటిపై పొందే మార్ట్‌గేజ్ రుణం చెల్లించకపోతే ఇంటిని కోల్పోవాల్సి వస్తుంది. గడువు ముగిసిన తర్వాత 30 రోజుల్లోపు చెల్లింపులు లేకపోతే దాన్ని డిఫాల్ట్ (బకాయిపడినట్టు)గా పరిగణిస్తారు. వరుసగా మూడు ఈఎంఐలు కూడా చెల్లించకపోతే, అప్పుడు బకాయిలను 60 రోజుల్లోగా సెటిల్ చేసుకోవాలంటే లీగల్ నోటీసు పంపిస్తాయి. ఆ గడువులోపు స్పందించకపోతే, సర్ఫేసీ చట్టం కింద ఇంటి జప్తు ప్రక్రియను మొదలు పెడతాయి. ఆ తర్వాత కూడా కొల్లేటరల్ (తాకట్టు) విలువ, వేలం తేదీ తదితర వివరాలతో ఒక నోటీసు పంపిస్తాయి. అప్పుడు స్పందించినా, బ్యాంక్‌లు పరిష్కారానికి అవకాశం ఇస్తాయి. చివరి ఆప్షన్‌గా ఇంటిని వేలం నిర్వహిస్తాయి. దీనివల్ల ఇంటిని కోల్పోవడంతోపాటు, క్రెడిట్ రిపోర్ట్‌లో కొన్నేళ్లపాటు దీని ప్రభావం కనిపిస్తుంది.

మిరే నుంచి మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్



మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తాజాగా మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జనవరి 24న ముగుస్తుంది. కనీసంగా రూ. 5,000, సిప్ విధానంలోనైతే రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. దీని ద్వారా సేకరించిన నిధులను ఈక్విటీ, డెట్.. మనీ మార్కెట్ సాధనాలు, గోల్డ్ ఈటీఎఫ్‌లు, సిల్వర్ ఈటీఎఫ్‌లు, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కమోడిటీ డెరివేటివ్స్ మొదలైన వాటిలో ఇన్వెస్ట్ చేస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)




15-1-2024	
విశాఖ	599–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	550–00
రిటైల్ ధర (డజను)	72.00
14-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

అదనపు పన్ను ఆదాకు మార్గం..?

పన్ను ఆదా కోసం సెక్షన్ 80సీ కింద ఇప్పటికే రూ.1.50 లక్షలు ఇన్వెస్ట్ చేశాను. దీనికి అదనంగా పన్ను ఆదా కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?

– రాకేశ్ వర్మ



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఐటీ చట్టం సెక్షన్ 80సీ కింద గరిష్ట పరిమితి రూ.1.5 లక్షల మేరకు ఇప్పటికే మీరు ఇన్వెస్ట్ చేసి ఉంటే.. అప్పుడు అదనపు పన్ను ఆదా కోసం మీ ముందున్న మార్గం నేషనల్ పెన్షన్ సిస్టమ్ టైర్–1. రిటైర్మెంట్ పథకమైన ఎన్‌పీఎస్‌లో గరిష్టంగా రూ.50,000 పెట్టుబడిపై పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందొచ్చు. సెక్షన్ 80సీకి అదనంగా కల్పించిన ప్రయోజనం ఇది. విశ్రాంత జీవనం కోసం నిధి ఏర్పాటు చేసుకోవాలనే లక్ష్యాన్ని సాకారం చేసేందుకు వీలుగా 2004లో కేంద్ర సర్కారు ఎన్‌పీఎస్ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 18–70 ఏళ్ల వయసు పరిధిలోని ఎవరైనా ఇందులో చేరేందుకు అర్హులే. ఒక ఏడాదిలో ఇందులో కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేసినా సరిపోతుంది. ఇందులో చేసిన పెట్టుబడి ఏదైనా కానీ 60 ఏళ్ల వరకు వెనక్కి తీసుకోవడానికి ఉండదు. అంటే అప్పటి వరకు లాకిన్ అయి ఉంటుంది. కొన్ని అసాధారణ పరిస్థితులు ఎదురైన సందర్భాల్లోనే దీన్నుంచి ఉపసంహరణలకు అనుమతి ఉంటుంది. 60 ఏళ్లు నిండిన తర్వాత అప్పటి వరకు సమకూరిన నిధి నుంచి 60 శాతాన్ని ఉపసంహరించుకోవడానికి అనుమతిస్తారు. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాలి. ఇటీవలి తీసుకొచ్చిన సవరణ నేపథ్యంలో 60 ఏళ్లు నిండిన తర్వాత.. నెల లేదా త్రైమాసికం లేదా ఏడాదికోసారి క్రమంగా కావాల్సినంత ఉపసంహరించుకోవడానికి వీలు ఏర్పడింది. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసే వారు 2 రకాల ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లలో ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. ఆటో లేదా యాక్టివ్. ఆటో ఆప్షన్ ఎంపిక చేసుకోవడం కొంత బెటర్. ఈ ఆప్షన్‌లో ఈక్విటీలకు కేటాయింపులు ఇన్వెస్టర్ వయసు ఆధారంగా మారుతుంటాయి. ఉదాహరణకు ఇన్వెస్టర్ వయసు 35 ఏళ్లు అనుకుందాం. 100 నుంచి 35 ఏళ్లు తీసివేయగా, మిగిలిన మేర (65%) ఈక్విటీలకు కేటాయింపులు వెళతాయి. ఇన్వెస్టర్ వయసు పెరుగుతున్న కొద్దీ ఈక్విటీలకు కేటాయింపులు తగ్గుతూ వెళతాయి. యాక్టివ్ ఆప్షన్‌లో ఈక్విటీలకు గరిష్టంగా 75% వరకు పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. ఈక్విటీ కేటాయింపులు పోను, మిగిలినదాన్ని డెట్, అల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలకు కేటాయించొచ్చు.

జేకే లక్ష్మీ సిమెంట్ | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

సాక్షి స్టాక్స్

ప్రస్తుత ధర: రూ. 869 **టార్గెట్:** రూ. 1,000

ఎందుకంటే: అనుబంధ సంస్థ ఉదయ్‌పూర్ సిమెంట్ వర్క్స్ లిమిటెడ్ ద్వారా జేకే లక్ష్మీ సిమెంట్ ప్రస్తుతం చేపట్టిన సామర్థ్య విస్తరణ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. వార్షికంగా 2.5 మిలియన్ టన్నుల(ఎంటీపీఏ) గ్రైండింగ్ యూనిట్ పనులు పటిష్ట రీతిలో కొనసాగుతున్నాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికానికల్లా(ఏప్రిల్–జూన్) వాణిజ్య ప్రాతిపదికన ప్రారంభంకావచ్చని అంచనా. ఇప్పటికే 1.5 ఎంటీపీఏ సామర్థ్యంగల క్లింకర్ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభంకావడంతోపాటు నిలకడను సైతం సాధించింది. ఉదయ్‌పూర్ సిమెంట్ ప్లాంటులో తయారయ్యే క్లింకర్‌ను గ్రైండింగ్ కోసం జేకే లక్ష్మీ సిమెంట్ వినియోగించుకుంటుంది. మరోపక్క సూరత్‌లోనూ 1.35 ఎంటీపీఏ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రణాళికల్లో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇందుకు రూ. 220 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు నిధులను అంతర్గత వనరులు, రుణాల ద్వారా సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. 1.35 ఎంటీపీఏలో 0.7 మిలియన్ టన్నుల సామర్థ్యం వచ్చే ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)కల్లా అందుబాటులోకి రానుంది. మిగిలిన 0.65 ఎంటీపీఏ సామర్థ్యం రెండేళ్ల తదుపరి(2025–26) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో ప్రారంభంకావచ్చని అంచనా. ప్రణాళికల ప్రకారమే దుర్గ్ ప్లాంటులో రైల్వే సైడింగ్ పనులు కొనసాగుతున్నట్లు కంపెనీ పేర్కొంది. నిర్వహణ లాభాలను పెంచుకునే బాటలో కంపెనీ విభిన్న చర్యలు తీసుకుంటోంది.



తేజాస్ నెట్‌వర్క్స్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 860 **టార్గెట్:** రూ. 1,050

ఎందుకంటే: పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) ఆధారిత టెలికం పరికరాల తయారీలో దేశీయంగా అతిపెద్ద కంపెనీగా తేజాస్ నెట్‌వర్క్స్ నిలుస్తోంది. వైర్‌లైన్, వైర్‌లెస్ నెట్‌వర్కింగ్ ప్రొడక్టుల తయారీ, డిజైనింగ్‌లో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మొదలు 2027–28 వరకూ కంపెనీ రూ. 29,200 కోట్ల విలువైన ఆర్డర్లను పూర్తి చేయనుంది. వెరసి రూ. 30,000 కోట్ల ఆదాయం, రూ. 6,000 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించే అవకాశముంది. ఇందుకు ప్రధానంగా ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్ఎన్ఎల్, భారత్ నెట్ ప్రాజెక్టులు తోడ్పాటునివ్వనున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) ఆదాయం గరిష్టస్థాయికి చేరే వీలుంది. ఈ ఏడాదితో పోలిస్తే 5 రెట్లు పుంజుకోవచ్చు. దేశీయంగా తయారీ రంగంపై దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ) ద్వారా కంపెనీ ప్రధానంగా లబ్ధిని పొందే అవకాశముంది. బీఎస్ఎన్ఎల్, భారత్‌నెట్, రైల్వే ప్రాజెక్టులపై ప్రభుత్వ భారీ పెట్టుబడి వ్యయాలు ఇందుకు సహకరించనున్నాయి. అంతేకాకుండా కీలక మౌలిక సదుపాయాలు, ప్రయివేట్ రంగం నుంచి పెరుగుతున్న డిమాండ్, ప్రపంచస్థాయిలో చైనాకు ప్రత్యామ్నాయ టెలికం పరికరాల కంపెనీలకు పెరుగుతున్న ప్రాధాన్యత సైతం తేజాస్ నెట్‌వర్క్స్‌కు ప్రోత్సాహాన్నిస్తున్నాయి. టాటా గ్రూప్ సెమీకండక్టర్ కార్యకలాపాలు కంపెనీకి ప్రయోజనం చేకూర్చే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే